సాక్షి కామారెడ్డి

బుధవారం : 13 : మార్చి : 2024



సేవాలాల్ బాటలో నడవాలి

ఎల్లారెడ్డిలో మంగళవారం సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పాల్గొన్నారు.

- 8లో ▸



గరిష్టం/కనిష్టం
37.6 /20.5

వాతావరణం

ఉదయంనుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత తగ్గే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

పసిడి పరుగులు

- 10 గ్రాములకు రూ.66,400

సాక్షి, కామారెడ్డి: పసిడి ధర పరుగులు తీస్తోంది. మంగళవారం మార్కెట్‌లో పది గ్రాముల బంగారం ధర రూ.66,400 లకు చేరింది. ఇది ఆల్‌టైం రికార్డు. ధర మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. ఇటీవలి వరకు రూ.62 వేల నుంచి రూ. 64 వేల వరకు ఉన్న ధర వారం రోజులుగా పెరుగుతూ వస్తోంది. మంగళవారం రూ. 66,400 లకు చేరింది.

'రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు'



సదాశివనగర్: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని శిక్షణ ఎస్పీ కాజల్ పేర్కొన్నారు. మంగళవారం మర్కల్ స్టేజీ వద్ద గల 44వ నంబర్ జాతీయ రహదారిపై ప్రమాదాలు జరుగుతున్న తీరును తెలుసుకున్నారు. ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు సూచించారు. మండలంలో మర్కల్ స్టేజీతో పాటు కుప్రియాల్ స్టేజీ, పద్మాజీవాడి చౌరస్తా, దగ్గి అటవీ ప్రాంతాల శివారు నుంచి ఉన్న జాతీయ రహదారిపై ఎక్కువ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నట్లు గుర్తించామని శిక్షణ ఎస్పీ తెలిపారు. ఆయా ప్రాంతాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీఐ సంతోష్‌కుమార్, ఎస్సై రాజు, మాజీ సర్పంచ్ సంగారెడ్డి, నాయకులు లింగాగౌడ్, సంపత్ గౌడ్ పాల్గొన్నారు.

'3.75 లక్షల ఎకరాల్లో పంటల సాగు'



నిజాంసాగర్: జిల్లాలో యాసంగి సీజన్‌లో 3.75 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయని జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి తెలిపారు. మంగళవారం మహమ్మద్‌నగర్ మండలంలోని రంగాపూర్ శివారులో సాగవుతున్న పంటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 2.42 లక్షల ఎకరాల్లో వరి సాగయ్యిందన్నారు. నెలరోజుల్లో వరి పంట కోతకు వచ్చే అవకాశాలున్నాయన్నారు. ఆమె వెంట ఏఈవో మధుసూదన్, ఆయిల్‌పాం అధికారి హమీద్ తదితరులు ఉన్నారు.

ప్రైవేట్ బ్యాంకుల్లో ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

కామారెడ్డి అర్బన్: జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ బ్యాంకుల్లో ప్లేస్‌మెంట్ కోసం రెండు నెలలపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నిజామాబాద్ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ ట్రెనింగ్ సంస్థ ద్వారా శిక్షణ అందిస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు ఈనెల 15 నుంచి 25వ తేదీలోగా బీసీ స్టడీ సర్కిల్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా 30 మందిని ఎంపిక చేసి శిక్షణకు పంపిస్తామని తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన వారికి నేరుగా ప్రైవేట్ బ్యాంకుల్లో ఉద్యోగాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 08462–241055 నంబరులో సంప్రదించాలని సూచించారు.

డీఎస్సీ కోచింగ్..


నిజామాబాద్‌అర్బన్: డీఎస్సీకి సన్నద్ధమవుతున్న అభ్యర్థులు ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఉచిత కోచింగ్ కోసం దరఖాస్తు చేసుకోవాలని నిజామాబాద్ జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి శశికళ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. డీఎడ్, బీఎడ్, టెట్ ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 12 నుంచి 26వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, మిగతా వివరాలకు 77021 75493, 99511 99460 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

బీసీ స్టడీ సర్కిల్‌లో..

బీసీ స్టడీ సర్కిల్‌లో డీఎస్సీ ఉచిత కోచింగ్ కోసం ఉమ్మడి జిల్లాకు చెందిన అభ్యర్థులు ఈనెల 14 నుంచి 22వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని స్టడీ సెంటర్ కో-ఆర్డినేటర్ వెంకన్న ఒక ప్రకటనలో సూచించారు. కోచింగ్ 75 రోజులపాటు ఉంటుందని పేర్కొన్నారు. ఇంటర్, డీఎడ్, టెట్ మార్కులు, రిజర్వేషన్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. మిగతా వివరాలకు 86390 02255 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆమెకేదీ అవకాశం!?





జనాభాలో సగభాగమైన మహిళలకు చట్టసభల్లోకి వెళ్లే అవకాశాలు దక్కడం లేదు. ప్రధాన రాజకీయ పార్టీలు కనీసం టికెట్లు ఇవ్వడానికీ ఆసక్తి చూపడం లేదు. స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేయడానికి మహిళలు సైతం ముందుకు రాకపోవడంతో చట్టసభల్లో వారి ప్రాతినిధ్యం అంతంత మాత్రంగానే ఉంటోంది. ప్రధాన పార్టీల తరఫున జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంనుంచి ఇప్పటివరకు ఒక్క మహిళ కూడా బరిలో నిలవకపోవడం పరిస్థితికి అద్దం పడుతోంది.

- లోక్‌సభ ఎన్నికల్లో టికెట్లు ఇవ్వని ప్రధాన పార్టీలు
- జహీరాబాద్ స్థానంలో ఒక్కరికీ దక్కని అవకాశం
- మహిళా రిజర్వేషన్లు అమలైతేనే ప్రయోజనం

సాక్షి, కామారెడ్డి : జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం 2008లో ఏర్పాటయ్యింది. 2009, 2014, 2019 సంవత్సరాల్లో ఎన్నికలు జరిగాయి. ప్రస్తుతం నాలుగోసారి ఎన్నికలు జరగనున్నాయి. అయితే మూడు పర్యాయాలు జరిగిన ఎన్నికల్లో ఏ ఒక్క పార్టీ మహిళలకు పోటీ చేసే అవకాశం ఇవ్వలేదు. ఈసారి ఇప్పటికే బీజేపీ, కాంగ్రెస్‌లు తమ అభ్యర్థులను ప్రకటించాయి. రెండు పార్టీలు పురుష అభ్యర్థులనే ఎంపిక చేశాయి. బీఆర్ఎస్ అభ్యర్థి ఎంపిక కూడా లాంఛనమేనని తెలుస్తోంది. ఆ పార్టీ సైతం మహిళను బరిలో నిలపకపోవచ్చని తెలుస్తోంది. అన్ని పార్టీలు మహిళలను స్థానిక సంస్థలకు పరిమితం చేస్తున్నాయి. రాజకీయ చైతన్యం ఉన్న మహిళా నాయకులు ఎంతోమంది ఉన్నా.. వారిని ప్రోత్సహించడం లేదు. దీంతో తమకు పార్లమెంట్‌లో అడుగుపెట్టే అవకాశం దక్కడం లేదని పలువురు మహిళా నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇండిపెండెంట్‌గా బరిలో ఒకే ఒక్కరు..

జహీరాబాద్ పార్లమెంట్ స్థానానికి మూడుసార్లు ఎన్నికలు జరిగాయి. ఇప్పటివరకు ఒక్క మహిళా అభ్యర్థే బరిలో నిలిచారు. 2009, 2014లలో ఒక్క మహిళా అభ్యర్థీ పోటీకి దిగలేదు. 2019లో మాత్రం నంగునూరి లత అనే మహిళ స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచారు. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికలలో మహిళలు ఎవరైనా స్వతంత్ర అభ్యర్థిగానైనా బరిలో దిగుతారేమో చూడాలి.

మహిళా ఓటర్లే ఎక్కువ

జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత జహీరాబాద్ లోక్‌సభ స్థానానికి ఇప్పటివరకు మూడుసార్లు ఎన్నికలు జరిగాయి. ప్రధాన పార్టీలు ఒక్క మహిళా అభ్యర్థికీ అవకాశం ఇవ్వలేదు. త్వరలో నాలుగోసారి జరగనున్న ఎన్నికల్లోనూ మహిళలకు అవకాశం దక్కేలా లేదు.

నియోజకవర్గంలో 8,33,849 మంది మహిళా ఓటర్లు, 7,97,649 మంది పురుష ఓటర్లు ఉన్నారు. పురుషులకన్నా 36,200 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. జుక్కల్ అసెంబ్లీ నియోజకవర్గంలో మహిళా ఓటర్లు 1,02,813 మంది, పురుషులు 99,113 మంది, బాన్సువాడలో మహిళలు 1,02,415 మంది, పురుషులు 93,266 మంది, ఎల్లారెడ్డిలో 1,15,355 మంది మహిళలు, 1,06,373 మంది పురుషులు, కామారెడ్డిలో 1,32,013 మంది మహిళలు, 1,22,238 మంది పురుషులు, నారాయణ్‌ఖేడ్‌లో 1,17,498 మంది మహిళలు, 1,18,064 మంది పురుషులు, ఆందోల్‌లో 1,27,364 మంది మహిళలు, 1,23,026 మంది పురుషులు, జహీరాబాద్‌లో 1,36,391 మంది మహిళలు, 1,36,569 మంది పురుష ఓటర్లు ఉన్నారు. నారాయణ్‌ఖేడ్, జహీరాబాద్‌లలో మాత్రమే స్వల్పంగా పురుష ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. మిగతా అన్ని నియోజకవర్గాలలో మహిళా ఓటర్లే అధికం.

పట్టించుకోని పార్టీలు..

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో మహిళా నాయకులు చాలామంది ఉన్నారు. నియోజకవర్గాల పునర్విభజనకు ముందు మెదక్ నియోజకవర్గంగా ఉండేది. అప్పట్లో మెదక్ పార్లమెంట్ స్థానంనుంచి దివంగత ప్రధాని ఇందిరాగాంధీ ఒకసారి పోటీ చేసి గెలిచారు. 2009లో జహీరాబాద్ నియోజకవర్గం ఏర్పాటయ్యింది. అప్పటినుంచి ఒక్క మహిళా ఎంపీగా ఎన్నికకాలేదు. పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో చాలామంది మహిళా నాయకులున్నారు. బీఆర్ఎస్ పార్టీలో టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్, ప్రస్తుత జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ, బీజేపీలో మాజీ ఎమ్మెల్యే అరుణతార, కాంగ్రెస్‌లో మాజీ మంత్రి గీతారెడ్డి.. ఇలా ఎందరో మహిళా నాయకులు ఉన్నా వారికి అవకాశాలు దక్కడం లేదు. మహిళలకు రిజర్వేషన్లు అమలు చేస్తేనే పరిస్థితి మారే అవకాశాలున్నాయి.

ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, అధికారులు

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

కామారెడ్డి క్రైం: పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అధికారులను ఆదేశించారు. పార్లమెంట్ ఎన్నికల ఏర్పాట్లపై మంగళవారం ఆయన హైదరాబాద్‌నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, అధికారులతో మాట్లాడారు. ఎన్నికల నిర్వహణ కోసం అవసరమైన మేర పోలింగ్ సిబ్బందిని సిద్ధం చేసుకోవాలన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులకు అవసరమైన శిక్షణ అందించేందుకు కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. ప్రింటింగ్ ప్రెస్‌లపై పూర్తి స్థాయి నియంత్రణ ఉండాలన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రచురించే ప్రతి ఫ్లెక్సీ, కరపత్రాలకు సంబంధించి ముందస్తు అనుమతులు తప్పనిసరి అన్నారు. ఎన్నికల నిర్వహణపై సామాజిక మాధ్యమాల్లో వచ్చే వార్తలను నిరంతరం పరిశీలించాలన్నారు. అపోహలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలన్నారు. ఓటింగ్ శాతం పెరిగేందుకు స్వీప్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలన్నారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అన్నారు. 18 ఏళ్లుపైబడిన నూతన ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వీసీ అనంతరం కలెక్టర్ జితేష్ వి పాటిల్ జిల్లా అధికారులతో మాట్లాడారు. ప్రముఖుల పేర్లు ఓటరు జాబితాలో ఉండేలా చూసుకోవాలన్నారు. నకిలీ ఓటర్లను జాబితా నుంచి నిబంధనల ప్రకారం తొలగించాలన్నారు. గతంలో తక్కువ పోలింగ్ నమోదైన కేంద్రాలను గుర్తించి, అందుకు గల కారణాలను తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా స్వీప్ అధికారి వెంకటేష్, ఉపాధి కల్పన అధికారి మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలి

- మాల్ ప్రాక్టీస్‌కు తావు లేకుండా చూడాలి
- కలెక్టర్ జితేష్ వి పాటిల్



సూచనలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: ఎస్సెస్సీ వార్షిక పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు. మాల్‌ప్రాక్టీస్, కాపీయింగ్‌లకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 18వ తేదీనుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో పరీక్షల నిర్వహణపై కలెక్టర్ పాటిల్ ఆయా శాఖల అధికారులతో మంగళవారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. జిల్లాలో 11,962 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. వీరికోసం 62 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా డ్యుయల్ డెస్కులు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, పరీక్షా కేంద్రాల వద్ద ప్రాథమిక చికిత్స క్యాంప్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు అవసరమైనన్ని ఆర్టీసీ బస్సులు నడపాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో డీఈవో రాజు, పరీక్షల సహాయ కమిషనర్ లింగం, ఆర్టీసీ డీఎం ఇందిర, డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్, పోలీసు, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు

- అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ డిమాండ్
- కలెక్టరేట్ వద్ద ఆందోళన

కామారెడ్డి టౌన్: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో మంగళవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర నాయకుడు భాస్కర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్లలో సీసీ కెమెరాలు బిగించడం, బయోమెట్రిక్ హాజరు అమలు చేయాలన్న నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎండాకాలంలో అంగన్‌వాడీ కేంద్రాలకు ఒక్కపూట విధులు అమలు చేయాలని, మే నెలంతా టీచర్లు, ఆయాలకు సెలవులు ఇవ్వాలని కోరారు. ఆన్‌లైన్‌లో నిర్వర్తించే పనుల కోసం 5జీ డేటా టెక్నాలజీ ఉన్న కొత్త ట్యాబ్‌లను ఇవ్వాలన్నారు. గతంలో చేసిన 24 రోజుల సమ్మె కాలానికి సంబంధించిన వేతనాలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయ ఏవోకు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కల్పన, యాదమ్మ, రాజనర్సు, జిల్లాలోని అంగన్‌వాడీ ఉద్యోగులు పాల్గొన్నారు.

టీచర్లు సమయపాలన పాటించాలి

- విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించను
- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి టౌన్: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి సూచించారు. మంగళవారం ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో విద్యాశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. తాను పాఠశాలలను తనిఖీ చేయనున్నట్లు తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించబోనన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమష్టి కృషితో విద్యాసంస్థలను అభివృద్ధి చేసుకుందామన్నారు. కార్యక్రమంలో డీఈవో రాజు, ఎంఈవో ఎల్లయ్య, హెచ్‌ఎంలు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

ఎయిర్‌పోర్టులతో సమానంగా రైల్వేల అభివృద్ధి

కామారెడ్డి టౌన్: దేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనలో ఎయిర్‌పోర్టులతో సమానంగా రైల్వే శాఖ అభివృద్ధి చెందుతోందని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. రూ. 85 వేల కోట్లతో చేపడుతున్న భారతీయ రైల్వే ఆధునికీకరణ పనులను ప్రధాన మంత్రి మోదీ మంగళవారం వర్చువల్‌గా ప్రారంభించారు. కామారెడ్డి రైల్వేస్టేషన్ శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. వన్ రైల్వే స్టేషన్ వన్ ప్రొడక్ట్ కార్యక్రమం మంచి ఆలోచన అన్నారు. వందేభారత్ లాంటి రైలును ప్రారంభించి రైల్వేలను అభివృద్ధి చేసిన ఘనత బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో రైల్వే అధికారులు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల భరత్, నాయకులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డి రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనుల శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే కేవీఆర్

తెయూ డిగ్రీ ఫలితాల్లో బాలికలదే పైచేయి

- మొదటి, మూడో, ఐదో రెగ్యులర్ సెమిస్టర్ ఫలితాలు విడుదల

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ డిగ్రీ(యూజీ) మొదటి, మూడో, ఐదో రెగ్యులర్ సెమిస్టర్ ఫలితాలను మంగళవారం కంట్రోలర్ ఎం.అరుణ, ఆడిట్‌సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్‌లతో కలిసి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ.. డిగ్రీ ఫలితాల్లో అన్ని సెమిస్టర్‌లలో బాలికలదే పైచేయి కావడం హర్షనీయమన్నారు. డిగ్రీ సెమిస్టర్ ఫలితాలను పారదర్శకంగా వేగవంతంగా అందించడంలో కృషి చేసిన కంట్రోలర్ ప్రొఫెసర్ అరుణ, అడిషనల్ కంట్రోలర్స్ నందిని, శాంతాబాయి, పరీక్షల విభాగం సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో పీఆర్‌వో పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మొదటి సెమిస్టర్‌లో 23.51 శాతం

మొదటి సెమిస్టర్‌లో 3,619 మంది బాలురు, 5,015 మంది బాలికలు, మొత్తం 8,634 మంది పరీక్షలు రాశారు. ఇందులో 8.87 శాతంతో 321 మంది బాలురు, 34.08 శాతంతో 1,709 మంది బాలికలు, మొత్తం 23.51 శాతంతో 2,030 మంది ఉత్తీర్ణులయ్యారు.



డిగ్రీ ఫలితాలు విడుదల చేస్తున్న రిజిస్ట్రార్ యాదగిరి, కంట్రోలర్ అరుణ

మూడో సెమిస్టర్‌లో 32.07శాతం

మూడో సెమిస్టర్‌లో 3,220 మంది బాలురు, 4,927 మంది బాలికలు, మొత్తం 8,147 మంది పరీక్షకు హాజరయ్యారు. ఇందులో 16.30శాతంతో 525 మంది బాలురు, 42.38 శాతంతో 2,088 మంది బాలికలు, మొత్తంగా 32.07 శాతంతో 2,613 మంది పాసయ్యారు.

ఐదో సెమిస్టర్‌లో 38.83 శాతం

ఐదో సెమిస్టర్‌లో 3,882 మంది బాలురు, 5,457 మంది బాలికలు, మొత్తం 9,339 మంది పరీక్షలు రాశారు. ఇందులో 21.84 శాతంతో 847 మంది బాలురు, 50.91 శాతంతో 2,778 మంది బాలికలు, మొత్తంగా 38.83 శాతంతో 3,626 మంది ఉత్తీర్ణులయ్యారు.

మహిళా సాధికారతకు కృషి చేయాలి

- జిల్లా జడ్జి ఎస్ఎన్ శ్రీదేవి
- టీ విక్రయించే మహిళకు సన్మానం



కామారెడ్డి క్రైం: మహిళా సాధికారతకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా జడ్జి ఎస్ఎన్ శ్రీదేవి సూచించారు. మహిళా దినోత్సవాలలో భాగంగా మంగళవారం కోర్టులో నిర్వహించిన కార్యక్రమంలో కామారెడ్డి కోర్టు ఆవరణలో 20 ఏళ్లుగా టీ కొట్టు నిర్వహిస్తూ నలుగురు సంతానాన్ని పెంచి పోషించిన శారదను సన్మానించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ఒంటరిగా ఉన్నా ధైర్యాన్ని కోల్పోకుండా స్వశక్తితో కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తున్న శారదను అభినందించారు. ఉన్నత ఆలోచనలు, ఆరోగ్యవంతమైన సమాజం మహిళ ద్వారానే సాధ్యమవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ సూపరింటెండెంట్ చంద్రసేన్‌రెడ్డి, సిబ్బంది ఖాన్, శ్రావణ్, పోలీస్ లైజనింగ్ అధికారులు విఠల్, హన్మండ్లు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- ఎస్పీ సింధు శర్మ
- జిల్లా స్థాయి వార్షిక పోలీసు క్రీడాపోటీలు ప్రారంభం

కామారెడ్డి క్రైం: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని, స్నేహ భావం పెంపొందుతుందని ఎస్పీ సింధు శర్మ పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని రాజీవ్ గాంధీ స్టేడియంలో మంగళవారం జిల్లా స్థాయి వార్షిక పోలీసు క్రీడా పోటీలను ప్రారంభించారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ సబ్ డివిజన్‌లు, డీపీవో, ఏఆర్ హెడ్ క్వార్టర్స్ బృందాలు 5 జట్లుగా ఏర్పడి స్పోర్ట్స్ పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిత్యం పని ఒత్తిడిలో ఉండే అధికారులు, సిబ్బందికి ఉపశమనం, ఉల్లాసం కోసం క్రీడాపోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది శాంతిభద్రతల పరిరక్షణతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపాలన్నారు. మొదటి రోజు 100 మీటర్లు, 200 మీటర్ల పరుగు పందెం పోటీలు, షాట్ పుట్, లాంగ్ జంప్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ట్రెయినీ ఐపీఎస్ కాజల్ సింగ్, ఏఎస్పీ నరసింహారెడ్డి, డీఎస్పీలు నాగేశ్వరరావు, శ్రీనివాసులు, సత్యనారాయణ, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసు క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎస్పీ సింధుశర్మ

క్లుప్తంగా

సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

కామారెడ్డి టౌన్: విద్యాశాఖలోని సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని సమగ్ర శిక్ష విద్యాశాఖ కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. గతంలో సీఎం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. చాలీ చాలనీ వేతనాలతో శ్రమదోపిడీకి గురవుతున్నామని తమకు న్యాయం చేయాలని కోరారు.

దివ్యాంగులకు బోధించడం అదృష్టం



గాంధారి: దివ్యాంగ చిన్నారులకు విద్యాబోధన చేయడం అదృష్టంగా భావించాలని డీఈవో రాజు అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని తిప్పారంతండా ప్రాథమిక పాఠశాలలో జిల్లా స్థాయి రిసోర్స్ టీచర్లతో సమావేశం ఏర్పాటు చేసి సమీక్షించారు. దివ్యాంగ చిన్నారులకు విద్యాబోధన, ఫిజియోథెరఫీ చికిత్సలు, వారికి అందుతున్న సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. దివ్యాంగ చిన్నారులకు ప్రయాణ ఖర్చులు సక్రమంగా ఇవ్వాలని ఆదేశించారు. పాఠశాలలో సమస్యలను తెలుసుకున్నారు. తాగు నీటి సమస్య, ప్రహరీ నిర్మించాలని విద్యార్థులు, తండావాసులు కోరారు. శ్రీపతి, ఉమారాణి, ఎంఈవో సేవులా పాల్గొన్నారు.

'కార్పొరేట్ల' కోసమే నూతన విద్యా విధానం

- రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్



మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి

తెయూ(డిచ్‌పల్లి): కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసమే కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం అమలు చేయాలని ప్రయత్నిస్తోందని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ పేర్కొన్నారు. తెలంగాణ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ సెమినార్ హాల్‌లో మంగళవారం విద్యార్థుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఏ పున్నయ్య అధ్యక్షతన 'నూతన విద్యా విధానం- ప్రైవేటీకరణ' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్యవక్తలుగా పాల్గొన్న ఆకునూరి మురళి, జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడు తూ.. విద్యార్థుల ప్రయోజనాలకి విరుద్ధంగా విదేశీ, కార్పొరేట్ ప్రయోజనాల కోసమే నూతన విద్యా విధానం తీసుకొచ్చారని ఆరోపించారు. ఈ విధానంతో దేశంలో విదేశీ యూనివర్సిటీలు ఏర్పాటు చేసి ప్రభుత్వ యూనివర్సిటీలను దివాళా తీసే చర్యలు చేపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ కొఠారి కమిషన్ ప్రతిపాదించిన విధంగా కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 10 శాతం, జీడీపీలో 6శాతం నిధులు కేటాయించకుండా, ఎన్ని సంస్కరణలు, విధానాలు తీసుకొచ్చినా ప్రయోజనం ఉండదన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం విద్యా రంగంలో తీసుకొస్తున్న మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా యువత ఉద్యమించాలని కోరారు. కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ వినాయకరెడ్డి, హైదరాబాద్ కేంద్రీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ కే లక్ష్మీనారాయణ, తెయూ అధ్యాపకులు నాగరాజు, యూనివర్సిటీల జాతీయ కన్వీనర్ ఎస్ నాగేశ్వర్ రావు, విద్యార్థి సంఘాల నాయకులు పి మహేష్, రామకృష్ణ, రెహమాన్, రాచకొండ విగ్నేష్, ఆర్ గౌతమ్ కుమార్, కర్క గణేష్, ఎం నరేందర్, జన్నారపు రాజేశ్వర్, అంజలి, రఘురాం, లావిశెట్టి ప్రసాద్, విఠల్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



లింగంపేట: మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన అయ్యవారి భిక్షపతి తల్లిదండ్రులు కొంత కాలం క్రితం మృతి చెందారు. అనాథగా మారిన భిక్షపతికి అదే గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు నీరడి సాయన్న అండగా ఉంటున్నాడు. భిక్షపతి జీవనానికి అవసరమైన సరుకులు, దుస్తులు ప్రతి ఏటా అందజేస్తున్నారు. కాగా భిక్షపతికి పెళ్లి కుదరడంతో ఖర్చుల కోసం మంగళవారం రూ.11,111 ఆర్థిక సాయం అందజేశారు. అలాగే ఇల్లు రిపేరు కోసం మరో రూ.నాలుగు వేలు అందించాడు.

ఎమ్మెల్యేకు సన్మానం



కామారెడ్డి టౌన్: బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలిగా నియామకమైన విశ్వనాథుల అనిత మంగళవారం కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను సన్మానించి, తనను జిల్లా అధ్యక్షురాలిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మహేశ్‌గుప్తా పాల్గొన్నారు.

సైన్స్ బిల్డింగ్ ఆకస్మిక తనిఖీ

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఆవరణలో కొనసాగుతున్న సైన్స్ బిల్డింగ్ నిర్మాణ పనులను రిజిస్ట్రార్ ఎం యాదగిరి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ ఏజెన్సీ తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషన్, విమెన్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ దేవదాస్‌తో పలు అంశాలపై రిజిస్ట్రార్ మాట్లాడారు. వర్సిటీ అసిస్టెంట్ ఇంజినీర్ వినోద్ ఉన్నారు.

బస్వాపూర్ విండో చైర్మన్‌పై అవిశ్వాసం నోటీస్



భిక్కనూరు: మండలంలోని బస్వాపూర్ సింగిల్ విండో చైర్మన్ కృష్ణాగౌడ్‌పై అవిశ్వాసానికి విండో డైరెక్టర్లు డీసీవో నాగభూషణంకు మంగళవారం నోటీసులు అందించారు. కృష్ణాగౌడ్ కాంగ్రెస్‌లో చేరడానికి యత్నిస్తూ.. డీసీసీబీ చైర్మన్‌పై అవిశ్వాసానికి మద్దతు ప్రకటిస్తున్నందునా విండో డైరెక్టర్లు ఆయనపై అవిశ్వాసానికి నోటీసు అందజేశారు.

సేవాలాల్ మహారాజ్ బాటలో నడవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

ఎల్లారెడ్డి: బంజారా సమాజాన్ని కాపాడిన వ్యక్తి సేవాలాల్ మహారాజ్ అని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. యువత ఆయన బాటలో నడవాలని సూచించారు. మంగళవారం ఎల్లారెడ్డిలో నిర్వహించిన సేవాలాల్ జయంతి ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జయంతి ఉత్సవంలో భాగంగా భోగ్‌భండార్ నిర్వహించారు. అనంతరం గిరిజనులు ఎమ్మెల్యేకు కత్తి, సేవాలాల్ చిత్ర పటాన్ని బహూకరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బంజారా సమాజం అభివృద్ధి కోసం బ్రిటిష్ వారితో పాటు, నిజాం నవాబులతో పోరాటం చేసిన మహనీయుడు సేవాలాల్ మహారాజ్ అన్నారు. బంజారాలు క్రిస్టియన్ మతంలో కలవకుండా అహర్నిషలు పోరాటాలు చేశారన్నారు. నియోజకవర్గంలోని అన్ని తండాలను అభివృద్ధి చేస్తామన్నారు. ఎల్లారెడ్డి పట్టణంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో టాయిలెట్ల మరమ్మతుల కోసం రూ.9.95 లక్షలు మంజూరు చేశామన్నారు. బంజారా సంఘం నాయకులు బద్యానాయక్, యశ్వంత్‌పవార్, సురేందర్, ప్రకాష్, దశరథ్‌నాయక్, లింబేష్ నాయక్, ఆర్డీవో ప్రభాకర్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు పాల్గొన్నారు.

అనుమతి లేని పాఠశాల సీజ్



విచారణ చేస్తున్న ఎంఈవో ఎల్లయ్య

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ఓ అపార్ట్‌మెంట్లో గదిలో ఎలాంటి అనుమతులు లేకుండా అడ్మిషన్‌లు తీసుకుంటున్న ఓ కార్పొరేట్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేశారు. ఎంఈవో ఎల్లయ్యకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టారు. ఎలాంటి అనుమతులు లేకున్నా అడ్మిషన్లు తీసుకుంటున్నారని విచారణలో తేలడంతో గదినీ సీజ్ చేశారు. విద్యాశాఖ నుంచి అనుమతులు లేని పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించడవద్దని ఎంఈవో తల్లిదండ్రులకు సూచించారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ చరణ్, జిల్లా హాస్టల్స్ కన్వీనర్ ఖలీల్, జిల్లా ఖేల్ కన్వీనర్ రోహిత్ నాయకులు సంతోష్, అల్తాఫ్, రాజు పాల్గొన్నారు.

స్వయంపాలన దినోత్సవం



ఎల్లారెడ్డిరూరల్: మండల కేంద్రంలోని గూడెం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వయంపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. ఎంఈవో వెంకటేశం, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు చిరంజీవులు, సీతాభవాని పాల్గొన్నారు.

సమాచారం

నేడు వేస్ట్ ఫ్రమ్ బెస్ట్ అంశంపై పోటీలు

కామారెడ్డి టౌన్: జిల్లాలోని ప్రభుత్వ, రెసిడెన్షియల్, కేజీబీవీ పాఠశాలల విద్యార్థులకు యూసేజ్ ఆఫ్ వేస్టేజ్ అంశంలో వేస్ట్ ఫ్రమ్ బెస్ట్ అంశంపై పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరాంరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని భవిత పాఠశాలలో జరిగే ఈ పోటీలకు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మున్నూరుకాపు విద్యార్థులకు సాయం

కామారెడ్డి అర్బన్: తండ్రి, సంరక్షుడు లేని మున్నూరు కాపు విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు ధర్మకర్తల సంస్థ చైర్మన్ ఎంఆర్ వెంకట్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసే విద్యార్థులు తండ్రి లేదా సంరక్షకుడి మరణ ధ్రువీకరణ పత్రం, 2023-24 విద్యా సంవత్సరం స్టడీ సర్టిఫికెట్, ఫీజు చెల్లించిన రశీదు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బ్యాంకు ఖాతా పాస్ బుక్ జిరాక్స్ జతచేయాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తులను కాచిగూడలోని మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహంలో అందిజేయాలని వివరించారు. వివరాలకు 040-24658160, 040-24657404, 9491627404 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

యువతి అదృశ్యం

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రం లోని ఎన్జీవోఎస్ కాలనీకి చెందిన యువతి శృతి (20) అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. కళాశాలకు వెళ్తున్నాని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె ఇంటికి తిరిగి రాలేదని, యువతి తండ్రి విజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో మంగళవారం తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



కామారెడ్డి క్రైం: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లిలో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 12 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. నిందితుడు గొరిశెట్టి సురేష్‌పై దేవునిపల్లి పీఎస్‌లో కేసు నమోదు చేసి బియ్యం బస్తాలను సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ తిరుపయ్య తెలిపారు.

త్వరలో బీఎస్‌ఎన్‌ఎల్ 4జీ సేవలు



వెంకటేశ్వర్లు

నిజామాబాద్‌సిటీ: ఉమ్మడి జిల్లాలో 4జీ సేవలు విస్తరించనున్నట్లు బీఎస్‌ఎన్‌ఎల్(భారత్ సంచార్ నిగమ్ సంస్థ) జనరల్ మేనేజర్ వీ వెంకటేశ్వర్లు వెల్లడించారు. జీఎంగా ఉమ్మడి జిల్లాకు నూతనంగా వచ్చిన ఆయన మంగళవారం 'సాక్షి'తో ఆయన మాట్లాడారు. టెలీకాం రంగంలో విప్లవాత్మక మార్పుల కారణంగా రానున్న రోజుల్లో సంస్థ ద్వారా వినియోగదారులకు మెరుగైన సేవలు అందబోతున్నట్లు తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో 164, కామారెడ్డి జిల్లాలో 102 టవర్లు ఏర్పాటు చేయనున్నట్లు జీఎం వెల్లడించారు. ప్రస్తుతం బాన్సువాడ పట్టణం మూడు 4జీ టవర్లు పరీక్షల నిమిత్తం ఉన్నాయని, వీటిద్వారా అక్కడి వినియోగదారులకు 4జీ సేవలు సంపూర్ణంగా అందుతున్నట్లు వెల్లడించారు.

ఫైబర్ పనులు పూర్తి

ఉమ్మడి జిల్లాలో బ్రాడ్‌బ్యాండ్ హైస్పీడ్ సేవలకు కాపర్ టు ఫైబర్ నెట్‌వర్క్ పనులు దాదాపు పూర్తయినట్లు జీఎం వెంకటేశ్వర్లు తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి, ఆర్మూర్, బోధన్ పట్టణ ప్రాంతాల్లో కాపర్ టు ఫైబర్ కనెక్షన్ల ద్వారా వినియోగదారులకు మరింత మెరుగైన సేవలందుతాయన్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం 12వేల బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్లు ఉన్నట్లు తెలిపారు. కనెక్షన్ల సంఖ్యను పెంచేందుకు ఉమ్మడి జిల్లాలో టెలీకాం ఇన్‌ఫ్రా ప్రొవైడర్స్ దాదాపు 100 మంది ఉన్నారని, త్వరలో మరో 50 మందిని నియమిస్తామని వెల్లడించారు.

క్రైం కార్నర్

కుటుంబ కలహాలతో అత్త ఆత్మహత్య

- తనను ప్రశ్నిస్తారనే భయంతో కోడలి ఆత్మహత్యాయత్నం
- ఆస్పత్రికి తరలింపు
- రెంజల్ మండల కేంద్రంలో కలకలం

రెంజల్(బోధన్): కుటుంబ ఆర్థిక పరిస్థితిపై అత్తాకోడళ్ల మధ్య మాటమాట పెరగడంతో అత్త ఆత్మహత్య చేసుకోగా, కోడలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన రెంజల్ మండల కేంద్రంలో కలకలం సృష్టించింది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన పెరిక లక్ష్మి(53), ఆమె కోడలు సోమవారం రాత్రి కుటుంబ ఆర్థికపరిస్థితిపై చర్చించుకుంటుండగా మాటమాట పెరిగి వాగ్వాదం జరిగింది. మనస్తాపానికి గురైన లక్ష్మి మంగళవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. చుట్టుపక్కల వారితోపాటు కుటుంబ సభ్యులు లక్ష్మి అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తుండగా, రాత్రి గొడవ విషయంలో తనను ప్రశ్నిస్తారనే ఆందోళనతో కోడలు ఇంట్లోని మరో గదిలోకి వెళ్లి ఉరేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, గమనించిన బంధువులు వెంటనే 108లో నిజామాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. రూ.10లక్షల అప్పు ఉండడంతో తన భార్య ఆత్మహత్య చేసుకుందని మృతురాలు లక్ష్మి భర్త భూమయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు లక్ష్మి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్‌లోని జిల్లా ఆస్పత్రికి తరలించారు.

హొన్నాజీపేట్‌లో యువకుడు..

ధర్పల్లి: ఆర్థిక ఇబ్బందుల కారణంగా మండలంలోని హొన్నాజీపేట్ గ్రామానికి చెందిన మెండె నరేశ్(30) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నరేశ్ సోమవారం సాయంత్రం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితులకు ఫోన్ చేసి ఆరా తీసినప్పటికీ ఆచూకీ లభించలేదు. మంగళవారం సాయంత్రం గ్రామశివారులోని చెట్టుకు నరేశ్ మృతదేహం వేలాడుతూ కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలాన్ని పరిశీలించిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్ అదుపు తప్పి యువకుడి మృతి

వేల్పూర్/ఇబ్రహీంపట్నం: జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి గ్రామం వద్ద మంగళవారం రాత్రి బైకు అదుపుతప్పి వేల్పూర్ మండల కేంద్రానికి చెందిన రాజారపు నరేశ్(35) మృతి చెందాడు. వేములకుర్తికి చెందిన స్నేహితుని ఇంట్లో జరిగిన శుభకార్యంలో పాల్గొన్న నరేశ్ ఇంటికి తిరిగి వస్తుండగా, బైక్ అదుపుతప్పి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్ తెలిపారు.

చేపల వేటకు వెళ్లి ఒకరు..



లింగంపేట: మండలంలోని సురాయిపల్లి స్కూల్ తండాకు చెందిన రమావత్ రవీందర్(28) మంగళవారం చేపల వేటకు వెళ్లి మృతి చెందాడు. వివరాలు.. తండాకు చెందిన నలుగురు చేపల వేటకు వెళ్లారు. గ్రామ శివారులోని ఒంటరికుంటలో వల వేశారు. తిరిగి వలను తీసే క్రమంలో రవీందర్ కాళ్లకు వల తట్టుకొవడంతో కేకలు వేస్తూ నీట మునిగిపోయాడు. మిగతా వారు కాపాడే ప్రయత్నం చేశారు. బయటకు తీసి లింగంపేట ఆస్పత్రికి తరలించారు. అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య సరిత, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ముగ్గురిపై కేసు నమోదు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండల కేంద్రంలోని బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గంగాధర్ మంగళవారం తెలిపారు. అలాగే స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా వాహనాలను తనిఖీ చేశామని, సరైన ధ్రువపత్రాలు, నంబర్ ప్లేట్లులేని ఏడు ద్విచక్రవాహనాలతోపాటు ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నామన్నారు. ధ్రువపత్రాలు సమర్పిస్తేనే వాహనాలను రిలీజ్ చేస్తామని ఎస్సై స్పష్టం చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పోలీసులమని బంగారం అపహరణ

- వృద్ధుడిని దోచుకున్న దుండగులు
- నవీపేట మండల కేంద్రంలో ఘటన



బాధితుడు నరసింహాచారి

నవీపేట: 'మేము పోలీసులం.. మా సార్ ముందు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. బంగారు గొలుసు, ఉంగరాలు కనిపించకుండా దాచుకో..' అని భయ పెట్టిస్తూనే ఓ వృద్ధుడిని నకిలీ పోలీసులు దోచుకున్నారు. ఈ ఘటన నవీపేట మండల కేంద్రం పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. నవీపేట శివారులోని లింగమయ్యగుట్ట కాలనీకి చెందిన రిటైర్డ్ విద్యుత్ ఉద్యోగి నరసింహాచారి మంగళవారం ఉదయం మండల కేంద్రంలోని మార్కెట్‌కు వచ్చాడు. పని ముగించుకుని స్కూటీపై ఇంటికి తిరిగి వెళ్తుండగా, బాసర రోడ్డుపై ఎదురు గా బైక్‌పై ఇద్దరు వ్యక్తులు వచ్చారు. నరసింహాచారిని ఆపిన ఆ వ్యక్తులు.. తాము పోలీసులమని, మా పెద్ద సార్ ముందు వాహనాలను తనిఖీ చేస్తున్నాడని నమ్మించారు. మెడలోని బంగారు గొలుసు, చేతివేళ్లకు ఉన్న రెండు ఉంగరాలను స్కూటీ డిక్కీలో దాచుకోవాలని సూచించారు. వారి మాటలను నమ్మిన నరసింహాచారి బంగారు గొలుసు, ఉంగరాలను పేపర్‌లో చుట్టి స్కూటీ డిక్కీలో పెట్టే ప్రయత్నం చేస్తుండగా, దండుగులు అతడిని ఏమార్చి మరో పేపర్ పొట్లంను డిక్కీలో పెట్టారు. నరసింహాచారి కొంతదూరం వెళ్లిన తరువాత అనుమానంతో పేపర్‌పొట్లాన్ని విప్పి చూడగా అందులో ఐదు రోల్డ్‌గోల్డ్ ఉంగరాలు ఉన్నాయి. తాను మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ సతీశ్, ఎస్సై యాదగిరిగౌడ్ సంఘటనాస్థలానికి చేరుకొని దగ్గరలోని సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించారు.



నకిలీ పోలీసులు పేపర్‌లో చుట్టిన రోల్డ్‌గోల్డ్ ఉంగరాలు

ఇస్తాంబుల్‌లో తప్పిపోయిన జాన్కంపేట్ వాసి

- మతిస్థిమితం కోల్పోయి ఇంటికి వస్తూ..
- జాడ తెలియక కుటుంబికుల ఆందోళన



భానుచందర్ (ఫైల్)

వేల్పూర్: నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం జాన్కంపేట్ గ్రామానికి చెందిన అగ్గు భానుచందర్ టర్కీ దేశంలో మతిస్థిమితం కోల్పోయి ఇంటికి తిరిగివస్తూ ఇస్తాంబుల్ ఎయిర్‌పోర్టులో తప్పిపోయాడు. ఈ విషయం కుటుంబీకులకు తెలియడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. భానుచందర్, జాన్కంపేట్‌కు చెందిన మరో వ్యక్తి గంగారెడ్డితో కలిసి 15 రోజుల క్రితం ఉపాధికోసం టర్కీ దేశానికి వెళ్లాడు. వారం రోజులు బాగానే ఉన్నా తర్వాత మతిస్థిమితం కోల్పోయి పనిచేయలేని స్థితికి చేరుకున్నాడు. దాంతో అతనికి పని కల్పించిన కంపెనీవారు ఈనెల 6న ఆర్మూర్ మండలం పిప్రి గ్రామానికి చెందిన ఒక వ్యక్తితో జతచేసి ఇంటికి పంపించారు. టర్కీలోని ఇస్తాంబుల్ చేరుకొని ఇండిగో విమానంలో ముంబాయికి వారు చేరుకోవాలి. ఇస్తాంబుల్‌లో బోర్డింగ్ పూర్తయిన భానుచందర్ అక్కడే తప్పిపోయి ఇండిగో విమానం ఎక్కలేదు. ఎంత వెతికినా దొరకక పోయేసరికి పిప్రికి చెందిన వ్యక్తి ముంబాయికి చేరుకున్నాడు. భానుచందర్ మానసిక పరిస్థితి బాగా లేనందున ముంబాయి ఎయిర్‌పోర్టులో రిసీవ్ చేసుకోవాలని కుటుంబీకులకు ముందే సమాచారం అందడంతో వారు ముంబాయి ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అయితే భానుచందర్ రాలేదు. కుటుంబీకులు ఎయిర్‌పోర్టు అధికారులను సంప్రదించగా భానుచందర్ లగేజి వచ్చి, తిరిగి వాపసు వెళ్లిందని సమాచారం ఇచ్చారన్నారు. తమ వ్యక్తి ఆచూకీ తెలపాలని ముంబాయి పోలీస్‌స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. అనంతరం మంగళవారం హైదరాబాద్‌లోని టర్కీ రాయబార కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. భానుచందర్ విదేశాలకు వెళ్లడం ఇదే మొదటిసారి కావడం, మతిస్థిమితం కోల్పోవడంతో తల్లిదండ్రులు, భార్య సోని తీవ్ర భయాందోళన చెందుతున్నారు. భానుచందర్ ఆచూకీ కనుగొని ఇంటికి పంపాలని వారు కోరుతున్నారు.

ఇసుక క్వారీల తనిఖీ



బాన్సువాడ : బీర్కూర్ ప్రాంతంలోని మంజీరలో ఇసుక క్వారీలను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. రామచంద్రాపురం ఎస్పీ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో క్వారీలను తనిఖీ చేశారు. ఇసుక స్టాక్ యార్డ్‌ను పరిశీంచారు. ఇసుక క్వారీల్లో గతంలో చేపట్టిన తవ్వకాలు, ప్రభుత్వ పనుల కోసం ఏ మేరకు ఇసుక తరలించారనే నివేదికలను తయారు చేసి డీజీకి అందజేస్తామని ఎస్పీ శ్రీనివాస్‌రావు అన్నారు. ఆయన వెంట విజిలెన్స్ ఏజీ హరికృష్ణ, ఇన్‌స్పెక్టర్ మహేశ్, రాయల్టీ ఇన్‌స్పెక్టర్, మైనింగ్ టీఎస్‌ఎండీసీ అధికారులున్నారు.

చెత్తకుప్పలకు మంటలు

కామారెడ్డి టౌన్/కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ ఆవరణలో దుకాణాల వెనకాల ఉన్న చెత్త కుప్పలకు మంగళవారం మంటలు అంటుకున్నాయి. స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో వారు ఘటనాస్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు.

పెట్రోల్ బంక్‌లలో తనిఖీలు

కామారెడ్డి క్రైం: కామారెడ్డిలోని పలు పెట్రోల్ బంక్‌లలో టాస్క్‌ఫోర్స్, సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఐదు బంకుల్లో రికార్డులు, పెట్రోల్, డీజిల్ పోస్తున్న తీరుపై విచారణ జరిపామని హైదరాబాద్‌కు చెందిన టాస్క్‌ఫోర్స్ ఎస్సై శ్రీనివాస్‌రావు తెలిపారు. నిబంధనల ప్రకారమే ఆయా బంకుల్లో వ్యవహారాలు జరుగుతున్నట్లు గుర్తించామని వెల్లడించారు. డీటీ కిష్టయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో 25 గొర్రెలు మృతి

నిజామాబాద్ రూరల్: నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కంఠేశ్వర్ బైపాస్ సిగ్నల్ వద్ద సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో 25 గొర్రెలు మృతి చెందాయి. ఎస్‌హెచ్‌వో మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని జాల్నా జిల్లా నుంచి 150 గొర్రెలను డీసీఎం వాహనంలో తరలిస్తున్నారు. కంఠేశ్వర్ బైపాస్ వద్దకు రాగానే ఆర్మూర్ నుంచి అతి వేగంగా వస్తున్న కారు డీసీఎం వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో డీసీఎంలో ఉన్న 25 గొర్రెలు మృతిచెందగా మిగిలిన వాటికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో కారు ముందుభాగం తీవ్రంగా దెబ్బతిన్నది. కారులో ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలవడంతో జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డీసీఎం డ్రైవర్ వాగ్మారే ప్రకాష్ ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ అరేపల్లి అవినాష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

భార్యను వేధించిన భర్తపై కేసు

ఎల్లారెడ్డి: భార్యను వేధించిన భర్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ మంగళవారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన రొడ్డ రేణుకను ఆమె భర్త కిషన్ వివాహేతర సంబంధం ఉందంటూ తరుచూ కొడుతుండడంతో ఆమె ఫిర్యాదు చేసిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మున్సిపల్ వాహనం సీజ్

ఆర్మూర్‌టౌన్: ధ్రువీకరణ పత్రాలు లేకుండా నడుపుతున్న మున్సిపల్ వాహనాన్ని రోడ్డు రవాణా సంస్థ అధికారులు సీజ్ చేశారు. పెర్కిట్‌లో చెత్త సేకరిస్తున్న వాహనానికి రిజిస్ట్రేషన్, ఇన్సురెన్స్, ఫిట్‌నెస్ లేకపోవడంతో ఎంవీఐ వివేకానందరెడ్డి 15రోజుల క్రితం సీజ్ చేశారు. ధ్రువీకరణ పత్రాలు సమర్పించి వాహనాన్ని విడిపించుకోవాల్సిన అధికారులు వాహనాన్ని అలాగే వదిలేశారు. ప్రత్యామ్నాయంగా ట్రాక్టర్‌తో చెత్తను సేకరిస్తున్నారు.